ప్రజాశక్తి

శనివారం 2 డిసెంబరు 2023 5

శ్రీకాకుళం



తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆదివారానికి తుపానుగా మారి కృష్ణా జిల్లా మచిలీపట్నానికి సమీపంలో తీరం దాటే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావంతో ఈనెల 3, 4, 5 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు పేర్కొన్నారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోతలు పూర్తయిన వారు కుప్పలు పెట్టుకోవడం గానీ, వరి పనలపై టార్పాలిన్లు కప్పి జాగ్రత్తపరచాలని పేర్కొన్నారు. రాగి, వేరుశనగ, అపరాలు వేసే రైతులు ఈనెల ఏడో తేదీ వరకు ఆ పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు
- రబీలోనూ వెంటాడుతున్న సాగునీటి సమస్య
- ఇళ్ల బిల్లులు అందక లబ్ధిదారుల అవస్థలు
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా ఖరీఫ్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. వంశధార ఆయుకట్టులోని శివారు భూములకు సాగునీరందక పంటలు ఎండిపోయాయి. వంశధార కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించలేదు. షట్టర్ల అవినీతిపై సిఐడి కేసుతో కొత్తవి అమర్చకపోవడంతో పాడైన వాటితోనే నెట్టుకొస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు రాక వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు విద్యుత్, ఆర్ అండ్ బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. శనివారం నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వీటిపై సభ్యులు చర్చించి ఏం పరిష్కారం చూపుతారో అని ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా 3,81,833 ఎకరాల్లో (87 శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 3,39,588 ఎకరాల్లో (85 శాతం) సాగైంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో, వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం 15 మండలాల పరిధిలో 20,812 ఎకరాల్లో వరి ఎండిపోయింది. ఖరీఫ్‌లో 253 ఎకరాల్లో పెసలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 20 ఎకరాల్లో వేశారు. రాగులు 145 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా 20 ఎకరాల్లో వేశారు. గోగు పంటను ఈ సంవత్సరం 258 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా తీసుకోగా 48 ఎకరాల్లో వేశారు. నువ్వు పంటను 98 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా ఒక ఎకరాలోనూ వేయలేదు.



రబీలోనూ వెంటాడుతున్న సాగునీటి సమస్యలు

మునుపెన్నడూ లేని విధంగా వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోయాయి. ఒడిశాల్లోనూ వర్షాల్లేకపోవడంతో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా నవంబరులో వంశధారలో నాలుగు వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో ఉంటుంది. ప్రస్తుతం 500 క్యూసెక్కులకు మించి నీటి ప్రవాహం రావడం లేదు. నాగావళిలో ఈ సీజన్‌లో మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేది. ప్రస్తుతం నీటి ప్రవాహం జీరోకి పడిపోయింది. ఖరీఫ్ చివరిలో పంటలు ఎండిపోతుండడంతో తోటపల్లి, మడ్డువలస నుంచి నీటిని విడిచిపెట్టి పంటలను కాపాడారు. గొట్టాబ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.47 టిఎంసిలకు పడిపోయింది. మడ్డువలస రిజర్వాయర్ సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, 1.05 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో రబీలో ఆరుతడి పంటలకూ నీరు ఇచ్చే అవకాశం కనిపించడం లేదు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 19 వేల ఇళ్లకు సుమారు రూ.285 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బుల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలే అసలు సమస్య

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఈ ఏడాది 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ధాన్యం కొనుగోలులో గతేడాది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ విలువ పూర్తవడంతో దూర ప్రాంతాల్లోని మిల్లులకు కేటాయించారు. ఒక మండలానికి చెందిన రైతులకు 40, 50 కిలోమీటర్ల దూరంలో వేరే మండలంలో ఉన్న మిల్లులకు కేటాయించారు. దీంతో రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. ధాన్యం నాణ్యంగా లేవంటూ పలుచోట్ల ఆర్‌బికె సిబ్బంది తిరస్కరించారు. దీన్నే అవకాశంగా తీసుకున్న మిల్లర్లు వాటిని మిల్లర్లు తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో 80 కేజీల బస్తాకు అదనంగా నాలుగైదు కేజీలు ఎక్కువ తీసుకున్న పరిస్థితులను రైతులు చవిచూశారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది వర్షాల్లేక, సాగునీరు అందక పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. చెరువులు, కుంటల్లో ఇంజిన్లతో నీరు పెట్టడంతో పెట్టుబడి విపరీతంగా పెరిగినా, పంట మాత్రం చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా తదితర జీవనదులున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఏటా కరువుకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ కరువు ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చింది మాత్రమే కాదని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణం చేపడితే ఇచ్ఛాపురం వరకు 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు గానీ దశాబ్దాలుగా పాలకులు ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ప్రారంభించి 15 ఏళ్లు అయినా 50 శాతం పనులూ పూర్తి కాలేదన్నారు. వంశధార ఎడమ కాలువలో గుర్రపుడెక్క, తూటికాడ పిచ్చిమొక్కలతో కాలువలు పేరుకుపోయి నీరు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. వంశధార ఎడమ కాలువ ద్వారా 2400 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టాల్సి ఉన్నా, కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో 1200 నుంచి 1300 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టడం లేదని తెలిపారు. కాలువ నిర్వహణకు నిధులు కేటాయించి ఖరీఫ్ సీజన్‌కు ముందే పనులు పూర్తి చేయాలని అనేకసార్లు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దాని ఫలితంగానే రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయి వలసలు పోతున్నా, అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ కరువు తీవ్రతను గుర్తించడం లేదన్నారు. జిల్లాలో ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనన్నారు. ప్రభుత్వం స్పందించి కరువు తీవ్రతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి కరువు సహాయక చర్యల కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని, రెండో పంటకు స్వల్పకాలిక విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలన్నారు. ఉపాధి హామీ పనులు రెట్టింపు చేసి గ్రామాల్లోనే పనులు కల్పించి వలసలు నివారించాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు ఇంతవరకు ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించాలన్నారు.

ఆభరణాల మాయం వెనకెవరు?

- బంగారు ఆభరణాలపై మూడు నెలలకోసారి ఆడిట్
- తెలిసినా బయటకు పొక్కకుండా దాచిపెట్టారా?
- అధికారుల పాత్రపై అనుమానాలు
- బ్యాంకు వద్ద ఖాతాదారుల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గార స్టేట్‌బ్యాంకు శాఖలో ఆభరణాల గల్లంతుపై పోలీసులు లోతుగా విచారణ మొదలుపెట్టారు. బ్యాంకు ఉద్యోగుల్లో ఒక్కొక్కరి నుంచి వివరాలు రాబడుతున్నారు. ఖాతాదారుల నుంచీ స్టేట్‌మెంట్లను తీసుకుంటున్నారు. గల్లంతైన బంగారం విలువ రూ.4.07 కోట్లని అధికారులు చెప్తున్నా, అంతకంటే ఎక్కువే ఉంటుందన్న చర్చ సాగుతోంది. బ్యాంకులో అవకతవకలకు బాధ్యులని చేస్తూ క్యాషియర్ మంజు సురేష్, సర్వీస్ మేనేజర్ స్వప్నప్రియను అధికారులు సస్పెండ్ చేశారు. ఇందులో స్వప్నప్రియ కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యక్తిగత అవసరాల కోసం ఓ లోన్ కన్సల్టింగ్ నిర్వాహకుని సాయంతో ప్రయివేట్ ఆర్థిక సంస్థల్లో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టినట్లు ఇప్పటికే అంగీకరించారు. మనస్తాపానికి గురైన స్వప్నప్రియ ఈనెల 29న ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆడిట్, ఇతర తనిఖీల్లో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారం సరిగా ఉందా, లేదా అని పరిశీలించిన సందర్భంలో లెక్క తప్పినా చూసీచూడనట్టు వ్యవహరించారా?, ఖాతాదారులు ఇప్పట్లో విడిపించరని భావించారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బంగారంపై అప్పు తీసుకున్న వారు పూర్తిగా డబ్బులు చెల్లించి తమ నగలను తమకు అప్పగించాలని కోరడంతో రెండు రోజుల తర్వాత రావాలని సూచించారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ మాత్రం బ్యాంకులో ఆడిట్ జరుగుతోందని, డిసెంబర్ ఎనిమిదో తేదీ నాటికి ఖాతాదారులకు నగలు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు చెప్తున్నారు. తాకట్టు పెట్టిన బంగారంపై ప్రతి మూడు నెలలకోసారి అధికారులు ఆడిట్ చేస్తారు. ఆడిట్‌లో బయటపడినా, విషయాన్ని దాచిపెట్టారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. బ్యాంకులో ఇంత పెద్ద మొత్తంలో ఆభరణాలు గల్లంతు కావడంలో కేవలం ఒక్క ఉద్యోగి ఇంత పెద్ద రిస్క్ తీసుకుంటారా, బ్యాంకుకు చెందిన అధికారులెవరైనా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాతాదారుల ఆందోళన

బ్యాంకులో ఆభరణాలు గల్లంతు కావడంపై ఖాతాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బంగారు నగలు మాయమయ్యాయనే విషయం తెలుసుకుని శుక్రవారం బ్యాంకు దగ్గరకు చేరుకున్నారు. బ్యాంకు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తాము కుదవ పెట్టిన బంగారాన్ని తిరిగి తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

3, 4 తేదీల్లో జాతీయ సెమినార్

- జయప్రదం చేయాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 3, 4 తేదీల్లో నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించే జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సిఐటియు నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సెమినార్‌కు సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్రంలోని పలు కార్మికోద్యమ నాయకులు, కార్మికులు హాజరవుతారని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే సెమినార్‌లో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. సెమినార్ జయప్రదానికి ఉద్యోగులు, కార్మికులు, సంస్థలు, శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్థిక సహకారం అందించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, ఎం.ఆదినారాయణ మూర్తి, ఎన్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణల కోసం ఈనెల 2, 3 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ రెండు రోజులు ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బిఎల్‌ఒలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఇఆర్‌ఒలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి, 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులు తమ విధుల్లో ఎలాంటి అలసత్వం చూపరాదన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు తదితర అంశాలు ఏమైనా ఉంటే ప్రజలు వారిని సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

యువ ఓటర్ల నమోదుకు చర్యలు

యువ ఓటర్ల నమోదుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న 132 ఫారాలు, ఎస్-ఎస్ఆర్-24 సమయంలో స్వీకరించిన ఫారాల గురించి వివరించారు. నెల రోజుల్లో 23,305 మంది 18-19 ఏళ్ల వారిని ఓటర్లుగా నమోదు చేశామని చెప్పారు. మరో తొమ్మిది వేల మందిని కొత్త ఓటర్ల జాబితాలో చేర్చాల్సి ఉందని అంచనా వేస్తున్నామన్నారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను నెల రోజుల్లో 65,716 స్వీకరించామని చెప్పారు. వీటిలో ఇంకా 13,661 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు.

ఇవిఎం డిమానిస్ట్రేషన్ వాహనం ప్రారంభం

ఓటు హక్కు వినియోగంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఇవిఎం డిమానిస్ట్రేషన్ సెంటర్, మొబైల్ ఇవిఎం డిమానిస్ట్రేషన్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఓటర్లకు ఇవిఎంలపై అవగాహన కల్పించడానికి ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అప్రమత్తతతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. అప్రమత్తంగా ఉండడం ద్వారా ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా బాపూజీ కళామందిర్ వరకు శుక్రవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. బాపూజీ కళా మందిర్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ రక్త మార్పిడి సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్త పరీక్షలు చేసినప్పుడు వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో ఎనిమిది వేల మందికి ఎఆర్‌టి చికిత్స, రెండు వేల మందికి పెన్షన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్నంత మాత్రాన ఎయిడ్స్ ఉన్నట్లు కాదన్నారు. మూడు స్థాయిలు దాటిన తర్వాత ఎయిడ్స్ మారుతుందన్నారు. హెచ్‌ఐవి రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. హెచ్‌ఐవి పాజిటివ్ వ్యక్తులు చికిత్స తీసుకుంటూ మందులు తీసుకోవాలన్నారు. ఎయిడ్స్, లెప్రసీ నివారణ అధికారి అనురాధ జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారితో ఎయిడ్స్ నియంత్రణకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎయిడ్స్ వైద్యాధికారి బి.అప్పలనాయుడు, డిఐఒ ఈశ్వరీ దేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పి.వెంకటరమణ, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి ఉమామహేశ్వరరావు, రిమ్స్ ప్రతినిధి పద్మావతి, సమాజ సేవకులు మంత్రి వెంకట స్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌సిసి విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పట్టించుకోరా..?

స్పీకర్‌ను నిలదీసిన అయ్యవారిపేట గ్రామస్తులు

ప్రజాశక్తి - బూర్జ, పొందూరు

గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని, తాగడానికి కలుషిత నీరు తప్ప మంచినీరు లేదని, కాలువల్లేక మురుగునీరు రోడ్డుపైనే ఉండడంతో వ్యాధుల బారిన పడుతున్నామని బూర్జ మండలంలోని అయ్యవారిపేట గ్రామస్తులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలతో సహవాసం చేస్తున్నా పట్టించుకోరా అని గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్‌ను నిలదీశారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వర్షాధార భూములే ఆధారం కావడంతో చెక్‌డ్యామ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, టిడ్కో డైరెక్టర్ కె.గోవిందరావు, వైస్ ఎంపిపిలు బి.సూర్యారావు, కె.కృష్ణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బూర్జ : అయ్యవారిపేటలో గోతులు దాటుతున్న స్పీకర్ సీతారాం

మౌలిక సదుపాయాల కల్పనతో విద్యా ప్రమాణాల పెంపు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు మండలం తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.43 లక్షల ఆర్‌ఎంఎస్‌ఎ నిధులతో నిర్మించిన నూతన తరగతి భవనాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్, ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంఇఒలు రామరాజు, రాజారావు, వైసిపి మండల అధ్యక్షులు పి.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక 'లిఫ్ట్'లు తొలగిస్తాం

పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎగువ భాగంలో అనధికారికంగా నిర్మించిన ఎత్తిపోతల పథకాలతో దిగువ ప్రాంత భూములు బీళ్లుగా మారుతున్నాయని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. అనధికారిక లిఫ్ట్‌లను తొలగించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మండలంలోని పెద్దబొడ్డపాడులో అగ్ని ప్రమాదానికి ఆహుతైన పంట పొలాలను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎగువ ప్రాంతాల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాలతో దిగువ ప్రాంతంలో భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని శాశ్వతంగా తొలగించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. దిగువ ప్రాంత రైతులకు సకాలంలో నీరందించేందుకు మదన గోపాలసాగరం డిట్యూరింగ్ ప్రతిపాదనలు త్వరలో మంజూరవుతాయని తెలిపారు. ఎటువంటి విపత్తు వచ్చినా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పంట పొలాల రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు, మాజీ సర్పంచ్ ఆనందరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు మధు, మండల వ్యవసాయ అధికారి కిరణ్ వాణి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి

ఆరోగ్యకర సమాజానికి 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూపకల్పన చేసిందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి మూడో తేదీ వరకు నిర్వహించే పోటీలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. క్రీడల్లో పాల్గొనే వారు ఈనెల 13వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలకు 15 ఏళ్లు పైబడిన వారు పాల్గొనవచ్చన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాలుగు దశల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. వీటితోపాటు యోగా, రన్నింగ్ మారథాన్‌లు నిర్వహిస్తారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన కిట్లను సచివాలయాల్లో సిద్ధం చేసినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపిడిఒలు, నియోజకవర్గ స్థాయిలో ఆర్‌డిఒలు, జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యక్రమాలకు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. పోటీల నిర్వహణకు ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, శాప్ అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. రిజిస్ట్రేషన్ ఇప్పటికే https://aadudaamandhra.ap.gov.in/login online ద్వారా ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాల్లో 13,219 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, సిపిఒ వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా బిసి సంక్షేమాధికారి అనురాధ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, చీఫ్ కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ



పొందూరు : ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఎయిడ్స్ అంటువ్యాధి కాదని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు సి.హరిప్రియ అన్నారు. శుక్రవారం జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు అవరణలో అమె న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అమె ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దుంపల నరసింహమూర్తి, న్యాయవాదులు సంపతిరావు తిరుపతి, వెలమల అప్పలనాయుడు, పంచిరెడ్డి అర్జునరావు, చింతాడ వెంకటరావు, ఎండ వెంకటరావు, లఖినేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

పలాస : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైద్యులు చిన్నంనాయుడు, రఘురాం, వీరాస్వామి, సుశీల, అరుణ, కిరణ్, గీతారాణి, మెడికల్ కౌన్సిలర్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్, శోభారాణి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్. బాలాజీ పాల్గొన్నారు, ఎఓ శ్రీ.ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ, ఎఫ్.ఒ డా.ఆసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా. పెద్దింటి ముకుందరావు, పిఒలు డా.వి.సింహాచలం, డా.ఆర్.గణపతిరావు, డా.జి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ఎయిడ్స్ వ్యాధి విస్తరించకుండా అప్రమత్తంగా ఉండాలని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు రవికుమార్ సూచించారు. నగరంలోని రిమ్స్ ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఐవి రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు సెక్రెటరీ రాంగోపాల్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం అధికారి బలగ మురళీధర్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ లేని స్వచ్ఛమైన భారతదేశం కావాలన్నారు. తరిమేద్దాం తరిమేద్దాం ఎయిడ్స్ వ్యాధిని తరిమేద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు. ఎయిడ్స్‌పై అపోహాలు వద్దు, ఎయిడ్స్ అంటువ్యాధి కాదు అంటించబడినే వ్యాధి అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నారాయణరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎయిడ్స్ సింబల్ ఆకారంలో కూర్చుని నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆది కేశవరెడ్డి పాల్గొన్నారు.

పొందూరు: కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, ఎన్ఎస్ఎస్ పిఒ ఎ.బి.రమణ, వైద్యాధికారి పి. సుధీర్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లోలుగులో ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపహార్ సంస్థ ప్రతినిధులు బిఎం. పాల్, ఏసుదాసు, అప్పారావు, బెజ్జిపురం యూత్ క్లబ్ సభ్యులు శ్రావణి, పంచాయతీ, రెవెన్యూ, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో ప్రెవెన్షన్ యూనిట్ ట్రక్కర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటిండెంట్ ఎస్.అనుషా, వైద్యులు దేవేంద్ర రెడ్డి, రమేశ్ నాయుడు, శిల్ప, వి.క్రాంతి కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. మాధవరావు, ఐసిటి కౌన్సెలర్ రాజశేఖర్, పి.మోహన్, శ్రావణి, రేఖా, రవి కుమార్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నౌపడ : ఎయిడ్స్ నివారణ సింబల్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



టెక్కలి : విద్యార్థుల ప్రదర్శన

టెక్కలి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా స్థానిక ఒక్లోండ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన పలువురిని అలరించింది. పాఠశాల ఆవరణలో స్టాప్ ఎయిడ్స్ అని సూచిస్తూ విద్యార్థులు చేపట్టిన ఈ ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్ల మధులత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - కవిటి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలో రూ.66 లక్షలతో మంజూరైన ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకం శంకుస్థాపన చేశారు. అనంతరం కవిటి సచివాలయం -2లో జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయం-2లో గత నాలుగున్నరేళ్లుగా వివిధ సంక్షేమ పథకాల కింద రూ.24,72,06,309లు, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.27,97,57,662లు ఖర్చు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, నాయకులు ఎన్ని అశోక్, బెందాలం రమణమూర్తి, దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సినీ నటులు

పల్లెగూటికి పండగొచ్చింది రిలీజ్ వేడుక

ప్రజాశక్తి - పలాస

పలాస అన్నపూర్ణ థియేటర్‌లో పల్లె గూటికి పండగొచ్చింది సినిమా రిలీజ్ వేడుకలను చిత్రంలో నటించిన కళాకారులు ఘనంగా నిర్వహించారు. కంచరాన తిరుమలరావు కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించిన పల్లెగుటికి పండగొచ్చింది సినిమా శుక్రవారం పలాస అన్నపూర్ణలో రిలీజ్ అయింది. ప్రముఖ సినీ నటులు డాక్టర్ కుమార్ నాయక్ కేక్ కట్ చేసి గ్రామీణ వాతావరణం, వ్యవసాయమే ప్రధాన అంశంగా సాగిన ఈ సినిమాలో నాకు అవకాశం రావడం హర్షనీయమన్నారు. థియేటర్ యజమాని విజయకుమార్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తూ పలాస నుంచి సినిమాలో పలువురు కళాకారులు నటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో సినీ గేయ రచయిత కుత్తమ్ వినోద్, ప్రముఖనటులు సుమన్, సాయికుమార్, అన్నపూర్ణ, రఘుబాబు, డాక్టర్ కుమార్ నాయక్, టెక్కలి శ్రీను, రాపాక రామకృష్ణ, తిరుపతిరావు, పత్రి తాతారావు, నాగమణి నటించగా, సింధు సంగీతాన్ని అందించారు. కంచరాన లక్ష్మి నిర్మాతగా వ్యవహరించారు. శ్రీకాకుళ చరిత్ర సాయికుమార్ చక్కగా వివరణ ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది.

బీమా వర్తింపజేయాలి

ప్రజాశక్తి - పలాస

మండలం నీలావతి గ్రామానికి చెందిన చెల్లూరి సుందరరావు, రాగులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, ఆయా కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా వర్తింపు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నీలావతి గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి బీమా వర్తించదని వాలంటీరు చెబుతున్నారని, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నది బూటకమని ఈ సంఘటనతో తేలిందన్నారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని వైఎస్ఆర్ బీమా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, న్యూడెమాక్రసీ, లిబరేషన్ నాయకులు చాపర వేణుగోపాల్, ఎన్. గణపతి, వంకల మాధవరావు, మద్దిల రామారావులు పాల్గొన్నారు.

ఎపిఎస్ఎస్‌టిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, రాష్ట్ర కౌన్సిలర్ కె. రాజేశ్వరరావులు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా కె.వేణుగోపాలరావు, అధ్యక్షులుగా సామ సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. రమణ, సహధ్యక్షులుగా ఎం.లోకేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలుగా అరుణకుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తిరుమలరావు, గౌరవ సలహాదారుగా ఆర్. వేణుగోపాల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అనంతరం ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారాన్ని తగ్గించాలని, ప్రతి పాఠశాలకు ఇద్దరేసి చొప్పున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

పార్టీలకతీతంగా పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

రాజకీయాలకతీతంగా నష్టపరిహారం చెల్లించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బొడ్డపాడు గ్రామ పంచాయితీ పరిధిలో చేతికి అందివచ్చిన వరిపంట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన విషయం తెలుసుకొని శుక్రవారం రైతులతో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్ని ప్రమాదంతో నష్టపోయిన రైతులకు రాజకీయాలు లేకుండా ఆదుకొవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సురాడ మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, రమణ, బల్లోజు శశి భూషణ్, కొనారి కిరణ్, అరసవల్లి ఉమామహేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న శిరీష



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఛార్జిమెమోలు జారీ చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని ఆపస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం వలన ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతుందన్నారు. ఇటువంటి చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపస్ ప్రతినిధి తమ్మినేని ఆనందరావు, ఉపాధ్యాయులు సోమరాజు, మురళి, క్రాంతి పాల్గొన్నారు

బోనెలకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - పలాస

గ్రీన్ ఆర్మీ వ్యవస్థపక సభ్యులు బోనెల గోపాల్‌కు అరుదైన గౌరవం లభించింది. ఎపి పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గ్రీన్ ఆర్మీని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు మర్యాదపూర్వకంగా గోపాల్ కలిశారు. ఈ నెల 4న జిల్లా పశుగణాభివృద్ధి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతారని గోపాల్ తెలిపారు. ఆయతో పాటు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ అధికారి నీలాపు ఉపేంద్ర ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన వివిధ అభివృద్ధి పనులను డ్వామా పీడీ చిట్టిరాజు శుక్రవారం పరిశీలించారు. తులసీగాం, ధర్మాపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిపనులు ఆకస్మికగా పరిశీలించారు. నేరుగా ఉపాధికూలీలతో మాట్లాడుతూ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, ఉపాధి ఎపిఒ శ్రీనివాస పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రయాణానికి వితరణ

ఇచ్ఛాపురం : ఇటీవల జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బెంగుళూరు వెళ్లేందుకు దాత ముందుకు వచ్చి సహకరించిన కుష్బూ రెడ్డికి పలువురు అభినందించారు. నేసనల్ మీట్‌కి సెలెక్ట్ అయిన ముగ్గురు విద్యార్థిలు బెంగళూరులో జరుగుతున్న ఖోఖో మీట్ అండర్-14లో గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు సాడి తేజశ్రీ, గొర్రెల భవాని, రేయ్య సరస్వతి సెలక్టయ్యారు. వీరికి ఊర్వశి బోటిక్ నిర్వహిస్తున్న కుష్బూ రెడ్డి స్పాన్సర్‌గా రాను, పోను ఇతర ఖర్చులకు నగదుసాయం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. గగన కుమారి, పిఇటి లత, క్లర్క్ తిప్పన జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ

మెళియాపుట్టి : ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సచివాలయాలకు అందజేసిన క్రీడా సామాగ్రిని శుక్రవారం ప్రత్యేకాధికారి భవాని శంకర్ పంపిణీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ చంద్రకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 21 సచివాలయాలకు క్రికెట్, వాలీబాల్, షెటిల్, రింగ్ టెన్నిస్ క్రీడలకు సంబంధించి సామాగ్రిని కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇఒ తిరుపతి పట్నాయక్, కార్యదర్శులు చింతల అప్పారావు, శివాజీ, మోహనరావు, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాయితీపై టార్పాలిన్లు అందజేయాలి

కొత్తూరు : గిరిజనులకు రాయితీపై టార్పాలిన్లు అందజేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావంతో మందస, మెలియపుట్టి, కంచిలి, సోంపేట, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, టెక్కలి వంటి గిరిజన మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయని వాటిని అధికారులు ఏరియల్ సర్వే చేసి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కాలిపోయిన వరి పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద బొడ్డపాడులో కాలి బుడిదైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల్లో రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. వంశధార చివర భూములకు నీరందక వరుసగా మూడేళ్ళ కరువుకు ఈ ప్రాంత రైతాంగం గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన కొద్దిపాటి తిండి గింజలకు, పశుగ్రాసానికి ఉపయోగపడుతుందని ఆశించే రైతుకు చివరకు బూడిద మిగిలిందన్నారు. ఈ నాలుగేళ్ళ రైతుల కష్టాలు పట్టని మంత్రి అగ్నికి ఆహుతైన ప్రాంతాన్ని సందర్శించడం అభినందనీయమైనా ఇది ఎన్నికల ఎత్తుగడ కాకుండా రైతులకు ఉపయోగ పడేవిధంగా చర్యలు ఉండాలని వారు కోరారు. సుమారు 70 రోజులు నుంచి వర్షంలేక అదనపు పెట్టుబడులతో నీటినిపెట్టినా 20 శాతానికి మించి దిగుబడులు రాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పంటల బీమా, పంట నష్టపరిహారం చెల్లించి రైతు ఆకలి మంటలు తీర్చలని వారు డిమాండ్ చేశారు.



దగ్ధమైన పంట పొలాలను పరిశీలిస్తున్న ఆనందరావు

ప్రభుత్వం ఆదుకోవాలి : రైతుసంఘం

పెద్దబొడ్డపాడు అగ్ని ప్రమాదంలో వరిపంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వజ్రపుకొత్తూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు కొర్నాన బాలాజీరావు, తమ్మినాన భాస్కరరావు డిమాండ్ చేశారు. కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి అగ్ని ప్రమాదం జరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పశువులకు మేత కూడా లేకుండాపోయిందని వాపోయారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రణస్థలం

యుటిఎఫ్ రణస్థలం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జెఆర్.పురం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా జిల్లా యుటిఎఫ్ సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, ఎన్నికల పరిశీలకులుగా ఎస్.నారాయణరావు హాజరయ్యారు. మండల శాఖ అధ్యక్షులుగా డి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.కోదండరామయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా టి.శంకరరావు, డి.కోటేశ్వరరావు, కె.వెంకటరావు, శ్రావణ్ కుమార్, టి.కామేశ్వరరావు, డి.కుమారస్వామి, ఆర్.రాంప్రసాద్, బి.సంతోష్ కుమార్, జె.వెంకటేశ్వరి, ఎం నలినీ కుమారి, సిహెచ్ నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ బి.రవికుమార్ పాల్గొన్నారు.

కంచిలి : మండల యుటిఎఫ్ శాఖ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబురావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీ నాయిక్, ప్రధాన కార్యదర్శిగా నల్లాన రవి, గౌరవ అధ్యక్షుడిగా త్రినాథ్ సాహూ, సహాధ్యక్షులుగా కె.అనురాధ, జాకబ్ లిమ్మో, కోశాధికారిగా టి.త్రినాధ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - జి.సిగడాం


రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అన్నారు. మండలం పెంట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతులతో మాట్లాడారు. రైతులు ధాన్యం నాణ్యత, ఇతర పరిస్థితులను స్థానిక రైతుభరోసా కేంద్రంలో సిబ్బంది పరిశీలించి సమీప మిల్లర్లుకు ధాన్యం పంపించడం జరుగుతుందన్నారు.గతేడాది కంటే ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెంచుతున్నామన్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. 39ఎల్ గేటు బాగుచేస్తే చుట్టుపక్కల గ్రామాలైన మద్రివలస, దవలపేట, ఆనందపురం, అబోతులపేట, పాలకండ్యం, మధుపాం తదితర గ్రామాలకు నీరు పుష్కలంగా అందుతుందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్కా వెంకటరావు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడిఎ వెంకటరావు, సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు, నాగులవలస సర్పంచ్ ప్రతినిధి బత్తుల గోపీనాథ్, ఎంపిటిసి మక్క శ్రీనివాసరావు, మండల ఎఒ శారద, వ్యవసాయ సహాకురాలు కుసుమ, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

పొందూరు: జిల్లాలో ఇ-క్రాప్‌లో నమోదైన వరి పంట మొత్తాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్ పేర్కొన్నారు. మండలం కృష్ణాపురం ఆర్‌బికెలో శుక్రవారం నిర్వహించిన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ ఎస్.వెంకటరావు, ఎఒ బెండి బాబ్జి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మందస

రైస్ మిల్లుల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. మందస తహశీల్దార్ కార్యాలయంలో చైతన్య రైస్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ బి.పాపారావుకు వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ మండలం సిద్దూరు పరిధిలో గల రైస్‌మిల్లు డ్రైవర్లు, మిల్లు యజమానులకు మధ్య గత రెండేళ్ల క్రితం జరిగిన వేతన ఒప్పందం 2023 జూన్ 30తో ముగిసిందని, నూతన వేతనాలు కొరకు ఒప్పందానికి చర్చలు జరపాలని డిమాండ్ నోటీసు జూన్‌లో ఇవ్వడం జరిగిందన్నారు. నూతన వేతనాలు 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సి ఉండగా యాజమాన్యాలు చర్చలు సజావుగా సాగడానికి సహరించక ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజన్ మొదలైన తరువాత కార్మికులపై నెపం మోపి దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేయాలని చూస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయక పిఎఫ్, ఇఎస్ఐ వంటి సంక్షేమ చర్యలు చేపట్టక కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు జోక్యం చేసుకొని చట్టపరమైన హక్కులు, కనీస వేతనాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.లచ్చయ్య, బి.పోలయ్య, లోకనాధం, బి.వెంకట రమణ, సిహెచ్ రమణ, జనార్ధన, లోకేష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

పలాస: ఈ నెల 9న పలాస కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పలాస కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి మల్లా చక్రవర్తి అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, వరకట్న వేధింపులు కేసుల్లో బాధితులతో చర్చించి రాజీపడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కాశీబుగ్గ ట్రైన్ డిఎస్‌పి రాజారావు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పిఎల్ నారాయణ, బి.కె.ఆర్. పట్నాయిక్, కె. రజనీకుమార్, కె.ప్రభాకర్, వి.రవి, ఎల్‌సిహెచ్‌ఆర్ ఘనీ, దేవాశ్రీ, లక్ష్మీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఈనెల 9న జరగనున్న జాతీయ లోక్‌ఆదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు సి. హరిప్రియ అన్నారు. పోలీసులతో, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దుంపల నరసింహమూర్తి, సంపతిరావు తిరుపతి, వెలమల అప్పలనాయుడు, పంచిరెడ్డి అర్జునరావు, చింతాడ వెంకటరావు, ఎండ వెంకటరావు, లఖినేని శ్రీనివాసులు, సంపతిరావు శ్రీధర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పూండి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం కంచిలి మండలం అర్జునాపురం గ్రామానికి చెందిన ఎస్ మోహన్ రావు (45) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. శుక్రవారం పూండి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించామని మృతుని వద్ద లభ్యమైన ఆధార్‌కార్డుతో మృతుని భార్య లలితా కుమారికి, బంధువులకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా చెన్నైలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడని, వివాహేతర సంబంధాలు కారణంగా కుటుంబాన్ని దూరం పెడుతూ భార్యతో గొడవలు పడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరిలో సంక్రాంతి పండగకు వచ్చిన మృతుడు మోహనరావు తిరిగి ఏప్రిల్‌లో చెన్నై వెళ్ళిపోయాడు. మృతుడుకి డిగ్రీ చదువుతున్న ఓ కుమార్తె ఉందని ఎస్ఐ తెలిపారు. శవ పంచనామా చేపట్టి మృతదేహానికి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని భార్య లలిత కుమారికి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పలాస

మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన డొక్కారి కామయ్య(64) రెండు రోజుల క్రితం కొత్త పారసాంబ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం జరగ్గా విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కాశీబుగ్గ ఎఎస్ఐ గణపతి తెలిపారు. మృతుడు బ్రాహ్మణతర్ల గ్రామంలో నివాసం ఉంటూ కాశీబుగ్గ సెగిడి వీధిలో పాడి పశువులు కాస్తూ ఉంటాడు. గురువారం తెల్లవారుజామున బ్రాహ్మణతర్ల గ్రామం నుంచి కాశీబుగ్గకు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.



సందీప్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సందీప్‌కు సత్కారం

ప్రజాశక్తి - పొందూరు

సివిల్ సర్వీసులో సత్తాచాటిన మండలం కింతలి గ్రామానికి చెందిన బెండి సందీప్‌ను హైదరాబాద్‌లో కళింగ కార్తీక వనభోజన మహోత్సవం సందర్భంగా కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్‌కు చెందిన పలువురు సంఘం పెద్దలు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోగలమని సందీప్ నిరూపించారన్నారు. తాజాగా సివిల్ సర్వీస్ - 2022 రిజర్వు లిస్ట్‌లో స్థానం పొందడం ఎంతో ప్రశంసనీయమన్నారు. సందీప్ స్వగ్రామం కింతలి కాగా, ప్రస్తుతం ఈయన తండ్రి బెండి వాసుదేవరావు తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు పైడికిల్లి సతీష్, సీపాన సింహాచలం, బెండి నాగభూషణ్, బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి, సూర గిరి పాల్గొన్నారు.

నేడు యుటిఎఫ్ సమావేశం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

స్వర్ణోత్సవ ఆరంభ వేడుకలు, జిల్లా కౌన్సిల్ సమావేశం ప్రభుత్వ జూనియర్ కళాశాల కోటబొమ్మాళిలో శనివారం ఉదయం 9 గంటలకు జరగనున్నాయని యుటిఎఫ్ నాయకులు తమ్మినేని వైకుంఠరావు తెలిపారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

3న వికలాంగుల సదస్సు

టెక్కలి: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 3న టెక్కలి పాత బస్టాండ్ ఆవరణలో వికలాంగుల సదస్సు నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షులు ఆవుల వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ కార్యకలాపాల విషయాలపై చర్చిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2,700 పెన్షన్ సౌకర్యాన్ని ప్రతి వికలాంగులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ప్రతిఒక్కరు హాజరుకావాలని వేణుగోపాల్ కోరారు.

మొక్కలను పర్యవేక్షించాలి

టెక్కలి రూరల్ : మొక్కలను పర్యవేక్షించి సుందర వనంగా తీర్చిదిద్దాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. శుక్రవారం కె.కొత్తూరు, సంతకొనరులో రూ. 9 లక్షల 50వేలతో చేపడుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరుపోసి అందమైన పార్క్‌గా కనిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెర్రి శంకరరావు, ఎపిఎం బగాది ప్రసాదరావు, టెక్నికల్ అసిస్టెంట్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ పేర గడ్డయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని నందికొండ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న ఆహార నిల్వలను, రికార్డులను పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై కార్యకర్తకు పలు సూచనలు చేసారు.

'పొలంబడి'తో రైతులకు అవగాహన

కోటబొమ్మాళి పొలంబడి కార్యక్రమం ద్వారా రైతును శాస్త్రవేత్తగా తీర్చిదిద్దడమే కాకుండా, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలో రైతులకు అవగాహన కల్పించామని టెక్కలి ఎడిఎ బివి. తిరుమలరావు అన్నారు. శుక్రవారం మండలం వాండ్రాడ రైతు భరోసా కేంద్రం పరిధిలో వైఎస్ఆర్ పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించి మాట్లాడుతూ 14 వారాలు పాటు నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు జరిగే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో విఎఎ సత్యరాజ్‌కుమార్, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, వ్యవసాయ మండల చైర్మన్, రైతులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి- కవిటి

మండలం నెలవంక, సీమూరు గ్రామాల్లో శుక్రవారం భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో సీమురు గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యంగా ప్రజలు ఆలోచిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, మణిచంద్ర ప్రకాష్, బార్ల చినబాబు, హరికృష్ణ బిసాయి, తట్ట హేమదాస్, బాలరాజు పాల్గొన్నారు.

బిసిలకు పదవుల ఘనత జగన్‌దే

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బిసిలకు కేబినెట్‌లో, నామినేటెడ్ పదవుల కల్పనలో అధిక ప్రాధన్యాత ఇచ్చిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల జగన్మోహన్‌రెడ్డి బిసీలకు మోసం చేశారని మాట్లాడుతున్నారని అయన గతం మర్చిపోయి వాస్తవాలు పక్కన పెట్టి టిడిపిలో మనుగడకోసం జాతీయ అ ధ్యక్ష, కార్యదర్శుల మన్ననలు పొందేందుకే అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు క్యాబ్‌నెట్‌లో కార్పోరేట్ సంస్థలు, వ్యాపార సంస్థల యజమానులు నారాయణ వంటివారికే మంత్రి పదవులు కట్టబెట్టారని, బిసి నినాదం చేసే హక్కు టిడిపికి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, నాయకులు పేడాడ వెంకటరావు, నేతింటి సింహాచలం, సింగుపురం వినోద్, మెండ తాతయ్య పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘ సభ్యులు

లింగ వివక్షత వద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ సమాజంలో కుల, మత, జాతి వైషమ్యాలతో పాటు లింగ వివక్షతపై గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తూ, జండర్ ఆధారిత కార్యక్రమాలపై మాసోత్సవాలు నిర్వహిస్తూ ప్రతి మహిళా బాధ్యతతో భాగస్వామి కావాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో జండర్ కార్యక్రమాలపై మహిళా ప్రతినిధులకు అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం, వివక్షత లేకుండా ఆడపిల్లలందరిని మగ పిల్లలతో సమానంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, చంద్రావు, రమణ, రామప్పడుతో పాటు మండల సమాఖ్య సిబ్బంది కళ్యాణి, జగదీష్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి యాజమానాలు తమ ఇళ్లకు సంబంధించిన ఇంటి పన్నులు జనవరి 31లోగా చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆర్ఐ అమర్, ఆర్ఒ అప్పలస్వామి అన్నారు. శుక్రవారం ఇంటి పన్నుల వసూళుల్లో భాగంగా 10వ వార్డు డెంకివీధి, పెంటవీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూళ్లకు వచ్చిన సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బిల్లు కలెక్టర్ ఢిల్లీ బెహరా, పెంటవీధి సచివాలయ అడ్మిన్ తరుణ్ పాల్గొన్నారు.

గుణుపూర్ రైలుకు ఎసి కోచ్

టెక్కలి : గుణుపూర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రైన్‌కు శుక్రవారం నుంచి ఎసికోచ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని రైల్వే డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు .0 8/5 21 నంబరు గల ట్రైన్‌లో నెలరోజుల పాటు ఎసికోచ్‌తో పాటు స్లీపర్ కోచ్ సౌకర్యం కూడా ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సౌరబ్ ప్రసాద్ తెలిపారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఇలైపురం సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో శుక్రవారం ఎపికి జగన్ ఎందుకు కావాలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వం రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతుభరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్ ,జెడ్‌పిటిసి గూడ ఎండయ్య , కరణం శశిభూషణరావు, ప్రసాదరావు, జయముని, అప్పారావు, జనార్ధన, నాగేష్ ఇఇపిఆర్‌డి తారకేశ్వరి, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పొలాకి: మండలం డిఎల్ పురం పంచాయతీలో ఎపికి జగన్ ఎందుకు సిఎం కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, శ్రీకాకుళం జిల్లా బిసి జోనల్ అధ్యక్షులు చింతాడ ఉమామహేశ్వరరావు, స్థానిక సర్పంచ్, ఎంపిటిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని బలద గ్రామంలో ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒ కృష్ణారావు, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ ఎస్.భారతి, తిరుపతిరావు, పంకజ్ దాస్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శాంతి

ఆమదాలవలస : మండలంలోని నెల్లిపర్తి సచివాలయం వద్ద వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, సర్పంచ్ ప్రతినిధి మానుకొండ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి


ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో నిర్మాణాలు జరుగుతున్న ప్రభుత్వ పక్కా గృహాలను గడువులోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ మురళీమోహన్ కుమార్ గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండో విడత నిర్మాణాలకు 150 ఇళ్లు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నిర్మాణాలను జనవరి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ వి.లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఎఇ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పొందూరు: జగనన్న కాలనీలతో పాటు నిర్మాణాల్లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ సీపాన హరిహరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ సన్యాసిరావు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి భవాని శంకర్, హౌసింగ్ డిఇ నర్సింగరావు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, హౌసింగ్, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్‌లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు నిర్మాణ దశలో ఉన్న పనులకు సంబంధించి ఎంత మేర బిల్లులు చెల్లింపులు చేపట్టారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ చంద్రకుమారి, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, చింతల అప్పారావు, మోహనరావు, శివాజీ, ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.


సోంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సోంపేట: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇళ్ల నిర్మాణాలపై, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎఒ భాస్కరరావు, ఇంజనీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే ఆయుధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజాస్వామ్యానికి ఓటే ఆయుధమని తహశీల్దార్ ఎస్.గణపతిరావు అన్నారు. శుక్రవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటేనన్నారు. రెవిన్యూ కార్యాలయం నుంచి ఒన్ వే జంక్షన్ మీదుగా జూనియర్ కాలేజీ వరకు రెవిన్యూ సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, జాతీయ సేవా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జె.రవిబాబు, ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు సాయిరాం, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ శిరీష, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలో శుక్రవారం తహసిల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, విఆర్‌ఒలతో కలిసి ఓటర్ల అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, రానున్న ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, విఆర్‌ఒలు, సంస్కార భారతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో ఆమీన్ సాహెబ్ పేటలో శుక్రవారం ఓటర్లకు ఇవిఎం ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల డిటి శ్రీహరి అధ్వర్యంలో మొబైల్ ఇవిఎం డిమానిస్ట్రేషన్ వాహనాన్ని ఓటర్లను ఇవిఎంల పట్ల అవగాహన పెంచడానికి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలో 299 పోలింగ్ బూత్‌లలో 189 పోలింగ్ లొకేషన్‌లలో జరుగుతుందని తెలిపారు. అర్హులందరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న డిటి శ్రీహరి

నర్సరీ ఏర్పాటుపై నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటల్లో నర్సరీ పెంపకం, యాజమాన్యంపై ఆత్మ ఆర్థిక సౌజన్యంతో మూడోరోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి హరికుమార్ యువ రైతులకు మొక్కల నారు తయారీ, నర్సరీలో మామిడి, సపోటా, జామి, నిమ్మతోట పంటల నారు, తక్కువ సమయంలో ఆదాయాన్నిచ్చే కూరగాయల నర్సరీలు, నర్సరీలు ప్రారంభించడానికి అవసరమైన పరిజ్ఞానం రైతులకు అందించారు. ఉద్యాన శాఖ అధికారి అయంతి కుమారి మాట్లాడుతూ నర్సరీ ఏర్పాటుకు సంబంధించిన నర్సరీ యాక్ట్, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వివరించారు.

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం

ప్రజాశక్తి- పలాస

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వ నాశినమైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు, పలాస మండలం రంగోయి గ్రామంలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పురవీధుల్లో పర్యటించి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశం పెట్టనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లోడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డిక్కల ఆనందరావు, రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని శ్రీజగన్నాధపురం గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు సాసుమంహతి ఆనందరావు అన్నారు. శుక్రవారం శ్రీజగన్నాధపురం గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రాయి మల్లేశ్వరరావు, బెండి సింహాచలం పాల్గొన్నారు. అలాగే మండలం చీపుర్లపాడు, హరిశ్చంద్రపురం, తిలారు, సరియాపల్లి తదితర గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి పోస్టర్లను అందజేశారు.


పలాస : పర్యటిస్తున్న గౌతు శిరీష

కుప్పిలికి ఉత్తమ కవితా పురస్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస


వెంకట రాజారావు

విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య గురజాడ వర్ధంతి సందర్భంగా జాతీయస్థాయిలో కవితల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 95 కవితలు రాగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించి ఎంపిక చేసిన పదిమందిలో పట్టణానికి చెందిన రచయిత, అభ్యుదయ కవి కుప్పిలి వెంకట రాజారావు గురజాడ ఉత్తమ కవితా పురస్కారానికి ఎంపికైనట్లు గురజాడ సాంస్కృతిక సామాఖ్య సంస్థ కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. 3న విజయనగరంలో ప్రముఖ సినీగీత రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నట్లు రాజారావు తెలిపారు.

గల్ఫ్ కార్మిక సంఘం సహాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గత కొన్ని రోజుల క్రితం చనిపోయిన వడ్డి వెంకటరమణ కుటుంబానికి గల్ఫ్ కార్మిక సంఘం తనవంతు సహకారం అందించింది. సమితి సభ్యులు శుక్రవారం అమలపాడులో మృతుని భార్య జ్యోత్స్నను కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెకు కుటుంబ ఖర్చులు నిమిత్తం రూ.పదివేలు ఆర్థికసాయం అందించారు. మృతుడు గల్ఫ్‌లో వలస కార్మికుడిగా పని చేస్తూ స్వగ్రామం వచ్చి బైక్ ప్రమాదంలో చనిపోయాడు. దీంతో కుటుంబ పరిస్థితి ఆర్థిక పరిస్థితి చాలా దారుణమైంది. కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఆ చుట్టుపక్క గ్రామాల్లో ఉన్నటువంటి గల్ఫ్ కార్మికుల సంఘం ఈ కార్యక్రమానికి ముందుకొచ్చి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో దున్న పెంటరావు, చింత మురళి, పుచ్చ భీమారావు, తామడ వీరాస్వామి, గోకిన వెంకటరమణ, మదనాల వెంకటరమణ, గార లక్ష్మణరావు పాల్గొన్నారు.


బిఎస్ఎఫ్ ఆకృతిలో బివికె విద్యార్థులు

సలాం సైనికా..

ప్రజాశక్తి- కవిటి

దేశ సేవలో సైనికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని, సలాం సైనికా అంటూ బివికె పాఠశాల కరస్పాండెంట్ పూడి రామారావు అన్నారు. సరిహద్దు భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బివికె పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేశ భద్రత, సైనికుల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు విశదీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన పలు ఆకృతులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం. అనిల్, ఎం.శిరీష, పాపారావు, సరిత, వినయ్, సుహాసిని, అంజలి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సుడా మాస్టర్ ప్లాన్‌పై సలహాలు అందించాలి

ఆమదాలవలస : పురపాలక సంఘం, పుర పరిసరాల మండలాలకు సంబంధించి శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) ఇటీవల రూపొందించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం. రవి సుధాకర్ ఒక ప్రకటనలో కోరారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో సుడా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్‌టిపిలు, పుర ప్రముఖులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

సోంపేట: పలాసపురం పంచాయతీ లక్కవరం అంగన్వాడీ కేంద్రంతో పాటు స్థానిక పాఠశాలను సర్పంచ్ తడక జోగారావు శుక్రవారం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రమణమూర్తి, డి మోహనరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

పంచాయతీల నిధులు దారిమళ్లింపు దారుణం

ప్రజాశక్తి- పలాస

పంచాయతీ నిధులు పథకాలకు మళ్లించడం దారుణమని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. పలాస నియోజకవర్గం పరిధిలో ఉన్న సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లు నేడు గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో పి.విఠల్‌రావు, వజ్రపు కొత్తూరు మండలం పిఎం పురం సర్పంచ్ గొరకల వసంత స్వామి, వజ్రపు కొత్తూరు మండలం



చినవంక పంచాయతీ సర్పంచ్ దువ్వాడ హెంబాబు చౌదరి, మందస మండలం సువర్ణ పురం పంచాయతీ సర్పంచ్ కరాగాన వాసు దేవరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం శుక్రవారం బిర్లంగి తోటవురు గ్రామంలో జరిగింది. వెలుగు ఎపిఎం ప్రసాదరావు అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలపై సంబంధిత అధికారులు అర్హులైన వారికి ఇప్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు మంగి లక్ష్మి రెడ్డి, ప్రజలు, కేశవ రెడ్డి, రఘు, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్రప్రభుత్వం పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో హరిశ్చంద్రపురం, మాసాహెబ్‌పేట పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది దివాకర్, పూజారి సత్యప్రియ, తిరుమలరావు, ఉప్పాడ నర్సింగరావు, శ్యామలరావు పాల్గొన్నారు.